32.

# దైవ నామస్మరణ సర్వ దుఃఖ పరిహారము

**సర్వరూపధరం శాంతం సర్వనామధరం శివమ్**
**సచ్చిదానందరూపం అద్వైతం సత్యం శివం సుందరమ్.**

ప్రేమస్వరూపులారా!

ఈ జగత్తునందు శాంతి, సుఖము అన్నది ఎక్కడను కానరాదు. మానవుడు శాంతిస్వరూపుడైకూడా తన శాంతిని తాను తెలుసుకోలేకపోతున్నాడు. తానే ప్రేమస్వరూపుడైనా కూడా తన ప్రేమను తాను అనుభవించలేకపోతున్నాడు. ఇత్యాది పవిత్రమైన గుణములు మానవుని యందుండికూడా తన సత్యాన్ని తాను గుర్తించుకోలేక అసత్యములో మునిగి అనంతమైన బాధలు అనుభవిస్తున్నాడు మానవుడు. దైవత్వమును వెతకవలెనన్న, శాంతిసుఖములు అనుభవించవలెనన్న ఎక్కడికో పోయి మనము వెతకనక్కరలేదు. స్వ స్వరూప సందర్శన భాగ్యము పొందగోరువాడు తన తత్వము తాను గుర్తించినప్పుడే యీ స్వస్వరూప దర్శనం లభ్యమవుతుంది. సూర్యుని ఆవిర్భవించిన తేజస్సును యీ మేఘములు, మేఘ సముదాయములు కేవలము సూర్యుడినే కప్పివేసి, సూర్యుని కనపించకుండా చేస్తున్నది. ఝుంఝా మారుతము వచ్చినప్పుడు యీ మేఘములు దూరము పోయి స్వస్వరూపుడైన సూర్యుడు గోచరిస్తాడు. ఈనాటి మానవునికి సత్యమును గుర్తించుటకు అడ్డు తగిలేది ఏమిటి? అన్నింటికి అడ్డు తగిలేది మనస్సే. ఈ మనస్సు ఆత్మనుండియే ఆవిర్భవించినది. సూర్యుని వల్ల లభ్యమైన మేఘములు సూర్యుని ఏవిధముగా కప్పివేస్తున్నవో అదే విధముగా ఆత్మ నుండి ఆవిర్భవించిన మనస్సు ఆత్మకే అడ్డు వస్తున్నది. దేని నుండి ఆవిర్భవించినదో అట్టి సత్యాన్ని మనం గుర్తించటానికి తగిన కృషి చేయాలి. ఈనాటి ప్రపంచమునందు అనేక అవస్థలకు గురై, అజ్ఞానములో చిక్కుకొని, శాంతి సంతోషములకు దూరమవు తున్నాడు మానవుడు.

**దైవమే మన మిత్రుడు**



sri sathyasai vahanamrutam

ప్రేమస్వరూపులారా! మానవత్వములో నుండిన దివ్యమైన శక్తి మరొక ప్రాణిలో మనకు ఎక్కడా కానరాదు. సమస్త శక్తులు మానవుని యందుంటున్నవి. ఇట్టి తనయొక్క దివ్యశక్తిని తాను తెలుసుకోలేకపోతున్నాడు. ఎప్పుడు దీన్ని తెలుసుకోటానికి వీలవుతుంది. "సుహృత్"ను అర్థము చేసుకొన్నప్పుడు దివ్యశక్తిని తెలుసుకోవచ్చు. దైవము యొక్క స్నేహాన్ని మనం పొందినప్పుడే సమస్తశక్తులు మనకు ఆవిర్భవిస్తుంటాయి. సుహృత్ అనగా స్వార్థము ఎరుగనివాడు, ప్రతిఫలము ఆశించనివాడు, ఎట్టి కీడును సల్పనివాడు, ప్రేమస్వరూపుడైనవాడు, స్నేహితుడు ఒక్కడే, అతడే భగవంతుడు. ఏ మానవుడైనా ప్రతిఫలమును ఆశించే తనకు ఉపకారము చేస్తుంటాడు. ఎట్టి ప్రతిఫలము ఆశించక, ఎట్టి దానికి ఏమాత్రం ఎదురు చూడక, వారియొక్క క్షేమమే తన ఆనందముగా భావించి స్నేహముతో సంచరించేవాడు ఒక్క భగవంతుడు మాత్రమే. కామ, క్రోధ, మోహ, లోభములవంటి విరుద్ధమైన గుణములు లోపల ప్రవేశించి మానవత్వానికి అశాంతిని కలిగించి, ఆనందమును దూరము చేస్తున్నాయి. అన్నింటికంటే మానవునకు శత్రువైనది కోరిక. ప్రాపంచిక సంబంధమైన కోరికలందు నేడు ద్వేషిగా ఉన్నవాడు రేపు స్నేహితుడుగా మారవచ్చు. నేడు శత్రువుగా ఉన్నవాడు రేపు మిత్రుడుగా మారవచ్చు. కానీ గీత ఆవిధంగా అంగీకరించలేదు. ఎప్పుడు శత్రువుగానే ఉండేది ఈ 'కోరిక'. ఈ కోరికలకు కూడా కొన్ని పరిమితములు ఉన్నవి. ఈ కోరికలు కేవలం మానవులకే కాదు, దేవతలకు కూడా ఉన్నాయి. ఇంద్రునికి, చంద్రునికి ఒక్క క్షణములో మార్పుచేసే శక్తి ఉంది. అయినా,ఈ కోరికలకు తృప్తి అన్నది ఎక్కడా కానరాదు. కనుక ఈ కోరికలను అగ్నితో, సముద్రముతో పోల్చినది వేదాంతము. ఈ అగ్నిలోపల ఎన్ని విధముల కట్టెలు వేసినప్పటికి, చాలు, చాలు అని చెప్పదు. దీనినే "అనలం" అని చెప్పింది గీత. అనగా యింక చాలు చాలు అనే పదము అగ్ని నుండి రాదు. ఎన్ని వేసినా యింకా కావాలని ఆశిస్తుంది. యింక సముద్రము ఏరీతిగా ఉన్నది? ఎన్ని నదులు వచ్చి ప్రవేశించినా సముద్రము ఎప్పటిరీతిగానే ఉంటుంది. సముద్రమునకు గానీ, అగ్నికి గానీ తృప్తి అన్నది ఎక్కడా కానరాదు. కనుక మానవుని మితిమీరిన కోరికలు యీ సముద్రము, అగ్ని వంటివి. మానవుని యందు త్రిగుణములు ఏకత్వము గావించుకున్నప్పుడే యీ సత్యము మనకు అర్థమవుతుంది. The proper study

srisathyasaivachanamrutam

of mankind is man. మన ఆలోచనలు, పలుకులు, పనులు మూడింటి ఏకత్వము గావించాలి. ఇట్టి ఏకత్వము మనలో కోల్పోయినాము. ఎవ్వరియందు ఐక్యత అనేది కానరాదు. ప్రతి వ్యక్తి యందు ఏదో ద్వేషము. ఈ ద్వేషమే మానవుని అన్ని విధములుగా హతమార్చి వేస్తున్నది. ద్వేషమును దూరముగావించుటకు దైవస్నేహమును మనం పెంచుకోవాలి. ఎక్కడ మన నివాసం. ఒక యిల్లు పేరు, ఒక హోటలు పేరు, హాస్టలు పేరు చెబుతుంటారు. కాదుకాదు. హోటలు కాదు మన నివాసం. ఇల్లు కాదు మన నివాసము. హాస్టలు కాదు నివాసము. ఏది మన నివాసం? హృదయనివాసం. ఇట్టి హృదయమునందున్న పవిత్ర స్నేహితుని మనం మర్చిపోతున్నాం. ప్రపంచమంతయు ఒక గ్రంథమే. దీన్ని చక్కగా చదువు. ఇదే నీ గురువు. Nature is the best teacher. ఈ జగత్తునందు తెలుసుకోవలసినవి, అనేకమైనవి కనిపిస్తున్నాయి. ఒక గ్రంథమునందో లేక మరొక సాధన యందో భగవంతుడు కానరాడు. నిరంతరము మనం గ్రంథములు చదువుతుంటాము. కానీ ఈ గ్రంథములద్వారా మనకు లభ్యమయ్యేది సందేహములే తప్ప సరియైనది కానరాదు. ఎంత మేధాశక్తి ఉన్నదో అంత సందేహశక్తి ఆవిర్భవిస్తూ ఉంటుంది. ప్రపంచమే మనకు గ్రంథము. దైవమే మన మిత్రుడు. ప్రేమయే మన యొక్క గృహము. దయయే మన సాధన. దయతో మనము చదివినప్పుడే, దయతో మనము సాధనలు సల్పినప్పుడే దివ్యమైన ప్రేమస్వరూపుడైన భగవంతుడు మనకు గోచరిస్తుంటాడు. ఈ గ్రంథములందు దైవము కానరాడు. కేవలము గ్రంథములు చదివి చదివి కట్టకడపటికి తానూ ఒక గ్రంథముగా మారిపోతున్నాడు. పుస్తకముగా నీవు తయారుకావద్దు. ఈ పుస్తకమునందున్నది మస్తకము నుండి ఏర్పడినదే.

**ప్రేమనేత్రము**

ప్రేమస్వరూపులారా! ప్రాచీనకాలమునుండి మన భారతదేశము అనేక ఆస్తికమార్గములందు ప్రబోధలుసల్పి, అన్ని దేశములకు శాంతిభద్రతలనందిస్తూ వచ్చింది. కనుకనే యీనాటి భారతీయులు కూడా లోకాస్సమస్తా సుఖినోభవంతు. లోకమంతా సుఖముగా ఉండాలని, సుఖమయలోకము కావాలని ఆశిస్తున్నారు. కనుక మనము దేశము యొక్క శాంతిని ఆశించాలి. దేశము యొక్క సౌభాగ్యాన్ని మనం ప్రేమించాలి. ఏ



sri sathyasai vachanamrutam

పనిచేసినా దేశము యొక్క విషయముతో మనం జీవించాలి. ఇక్కడ మూడు రకములైన శాంతులుంటున్నాయి. విశ్వశాంతి ఏవిధంగా లభిస్తుంది? ఈ విశ్వశాంతికి మూలకారణము సమాజము యొక్క శాంతియే. ఈ సమాజము యొక్క శాంతి ఎక్కడ నుండి ఆవిర్భవిస్తున్నాది? వ్యక్తియొక్క శాంతినుండియే సమాజశాంతి ప్రారంభమవుతున్నాది. కనుకనే వ్యక్తి, సమాజము, విశ్వము మూడు త్రిమూర్త్యాత్మక స్వరూపాలు. ఈ త్రిమూర్త్యాత్మక స్వరూపమే కాకుండా ఇవి అన్యోన్య ఆశ్రయమైనవి. ఇటువంటి అన్యోన్య ఆశ్రయముతో కూడిన యీ సమాజమును మనము యీనాడు దూరము చేసుకుంటున్నాము. ప్రతి మానవుని యొక్క శాంతి, సమాజముపై ఆధారపడి ఉంటున్నాది. సమాజాన్ని వదలి ఒక్క క్షణమైనా మనం జీవించలేము. సమాజమంతయు వ్యక్తి సమూహముతోనే కూడి ఉంటున్నది. ఇట్టి సమాజతత్వాన్ని ఏమాత్రం అర్థం చేసుకోలేకపోతున్నాము. సమాజము క్షేమంగా ఉండినప్పుడే విశ్వము క్షేమంగా ఉంటుంది. ఈనాడు శాంతి కబుర్లు చెప్పుతూ అశాంతి కర్మలు ఆచరించే దుష్టులు అధికమైపోతున్నారు. కన్నులుండి కూడా గుడ్డివారుగా జీవిస్తున్నారు. మెదడు ఉండి కూడా ఉన్మత్తునిగా మారిపోతున్నారు. ఇలాంటి వారికి ఏవిధమైన శిక్షను విధించాలి. మతి ఉండి ఉన్మత్తునిగా మారే వ్యక్తి కన్నులు తెరిపించాలి. ఏవిధంగా తెరిపించాలి? ఇదియే ప్రేమనేత్రము. ఈ ప్రేమనేత్రాన్ని తెరిచినప్పుడే జగత్తు యొక్క సుఖము మనం ఆశించటానికి వీలవుతుంది. విశ్వము యొక్క క్షేమాన్ని మనం గుర్తించక, సమాజము యొక్క ఆనందాన్ని విచారించక, విశ్వశాంతిని ఏరీతిగా నీవు కోరగలవు? అసాధ్యము. ఎన్ని రకములైన ధనధాన్యములు ఉండినప్పటికిని, ధన ధాన్యముల యొక్క సుఖము నిజమైన సుఖము కాదు. అమెరికా దేశముకు కుబేర సంతతి అని పేరు. కావలసినంత సిరిసంపదలున్నాయి. కానీ ఎంత ఉండి ఏమి ప్రయోజనము. మానసిక శాంతి లేదు. ఈ అమెరికాలో ఉండిన సుఖము భౌతిక సుఖము. ప్రాకృతమైన సుఖమే. వారికి ఏవిధమైన కొరతలు లేవు. ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క కారు ఉంటున్నది. ఇంటిలో ఆరుమంది వ్యక్తులుంటే ఆరు కార్లుంటాయి. ఈ కార్లయొక్క అభివృద్ధి ఏరీతిగా ఉంటున్నాదంటే ఒక కారుపై ఒకటి పెడితే ఆకాశాన్ని అంటుకుంటాయి. ఇన్ని సుఖాలుంటుండి కూడా వారికి శాంతి కానరాదు. కానీ

sri sathyasaivachanamrutam

భారతీయులు శాంతిస్వరూపులు. ఏవిధమైన ధనకనకవస్తు వాహనాదులు లేకపోయినా దైవప్రేమ వారియందు యిమిడి ఉంది.

**యా చింతాభువి పుత్రమిత్ర భరణౌవ్యాపార సంభాషణే**
**యా చింతా ధనధాన్య భోగయశసే లాభే సదాజాయతే**
**సా చింతా భువి నందనందన పద ద్వంద్వార విందేక్షణే**

మానవునియందు అన్ని చింతలకంటే భగవచ్చింతన ప్రధానమైనది. ఈనాటి మానవునకు మితిమీరిన చింతలుగా ఉంటున్నాయి. మానవుని అశాంతిలో ముంచేవి పన్నెండు చింతలు.

**పుట్టుట ఒక చింత, భూమినుండుట చింత**
**సంసారమొక చింత, చావు చింత**
**బాల్యమంతయు చింత, వార్ధక్యమొక చింత**
**జీవించుటొక చింత, చెడుపు చింత**
**కర్మలన్నియు చింత, కష్టంబులొక చింత**
**సంతసమొకచింత, వింత చింత**
**సర్వచింతలు బాపెడి సర్వేశు భక్తి**
**కనుడు యికనైన ప్రజలార కోర్కెమీర**

ప్రాచీనకాలమందు అనేక రాజులంతా ధర్మపాలనచేత రాజ్యము లేలుతుండేవారు. బలి అని పేరు చెబితే భయం వేస్తుంది. కానీ ఈ బలిచక్రవర్తి అలాంటి వాడు కాదు. విష్ణుభక్తుడు దయాహృదయుడు, ధర్మపాలకుడు. ఈ మూడు గుణముల చేత భగవంతుడు అతనిని వరించాడు. విష్ణుభక్తి ఒక్కటి ఉంటే చాలు. ఆ భక్తియే సర్వదుఃఖములను దూరము గావిస్తుంది. ప్రహ్లాదుడు నిరంతరము హరి హరి అని చింతించాడు.

**నారాయణ భజ నారాయణ్**
**తన్ మన్ రంజన భవ భయ భంజన**
**అసుర నిఖండన నారాయణ్**
**నారాయణ భజ నారాయణ్** ॥నా॥

sri sathyasaivachanamrutam

పర్వతములపైనుండి నెట్టుతున్నప్పటికిని నారాయణ నారాయణ అని స్మరించాడు. పడవలలో తీసుకుపోయి సముద్రము మధ్యభాగములో ముంచినప్పటికిని నారాయణ నారాయణ. మదగజములచే తొక్కించినప్పటికిని నారాయణ నారాయణ. విషసర్పములచే కరిపించినప్పటికిని నారాయణ నారాయణ. నిరంతరము నారాయణ స్మరణ చేయటంచేత ఈ దుఃఖములన్నీ అతనికి దూరమైపోయాయి. కనుక భగవద్భక్తి దుఃఖములను మరపింపచేస్తుంది. దివ్యత్వమైన తత్వాన్ని కల్పింపజేస్తుంది. ఇలాంటి ప్రహ్లాదుని శక్తినంతా తన భక్తిచేతనే యింత సాధిస్తూ వచ్చాడు. యితనే కాదు. సక్కుబాయి. ఈమె నిరంతరము అత్త పెట్టే బాధలకు, భర్తపెట్టే కష్టములకు సహించడానికి "రంగా! పాండురంగా" అని రంగ నామాన్ని తల్చుకుంటూ వచ్చింది. ఈ కష్టములన్నీ భగవన్నామము చేతనే తాను సాధిస్తూ, జయిస్తూ వచ్చింది. చక్రధారుడు. అతను కూడా యావిధమైన కష్టములకు ఓర్చుకొని దైవనామాన్ని స్మరించుకుంటూ తన దుఃఖమునంతా మరిచిపోయాడు. దైవ నామమునందు ఈ పవిత్రమైన శక్తి ఉన్నది. ఎటువంటి దుఃఖ సమయము నందైనా దుఃఖాన్ని మరిపింపజేస్తుంది. ఆనందమును ఆవిర్భవింప జేస్తుంది. ఉత్సాహమును ఊరింపచేస్తుంది. దివ్యత్వమును తేజరింపజేస్తుంది. కనుక మానవునకు ఈనాడు కావలసినది ఆనందమే. దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి నిమిత్తమై దైవత్వముతో స్నేహము గావించుకోవాలి. లోకములో ఎందరో స్నేహితులుంటున్నారు. దేనికోసం స్నేహితులు. Hellow, hellow. How are you, good bye good bye. భగవంతుడు అట్లాంటి స్నేహితుడు కాడు. భగవంతుడు నిరంతరము వెంటనే, జంటనే, యింటనే, కంటనే ఉంటుంటాడు. ఇలాంటి సత్యమిత్రుని, నిత్యమిత్రుని, ప్రేమమిత్రుని దూరం గావించుకోవటం చేతనే శత్రుత్వానికి గురైపోయారు. ఈనాడు లోకములో ఏమి వాంఛ గలిగింది? దైవవాంఛ దూరమైపోయింది. ధనవాంఛ, అధికారవాంఛ యీ వాంఛలచేత మానవుడు జీవితాన్ని కోల్పోతున్నాడు. ఈ ధనము ఎంతకాలము? వస్తుంది, పోతుంది. ఇదే శంకరాచార్యులవారు చెప్పారు. "**మాకురు ధన జనయౌవ్వనగర్వం హరతి నిమేషాత్ కాలః సర్వమ్**" ఈ చదువులుగానీ, యీ ధనములుగానీ క్షణభంగురమైనవే. కనుక పండితులనుకొని వ్యాకరణము చదివే వారి దగ్గరకు వెళ్లి శంకరులవారు బోధించారు.

sri sathyasai vachanamrutam

**భజగోవిందం భజగోవిందం**
**గోవిందం భజ మూఢమతే ॥భజ॥**
**సంప్రాప్తే సన్నిహితే కాలే**
**నహినహి రక్షతి డుకృఙ్కరణే ॥భజ॥**

ఇవి ఏవీ అంత్యములో ఆధారము చేయవు. కడపటికి దైవము ఒక్కడే ఆధారము. దైవము ఒక్కడే సరైన helper (సహాయకుడు) అతన్ని మనం యీనాడు విసర్జించాము. లోకాన్ని విశ్వసించాము. అన్నివిధాలా సుఖాన్ని కోల్పోతున్నాము. కాదు కాదు. దైవాన్ని విశ్వసించాలి. అతడొక్కడే మనకు సర్వరక్షకుడు. ఈ ప్రపంచమంతయు కనిపించేటువంటి సత్యమే. కానీ "కనిపించనిదే తినిపించును నీ కర్మల ఫలితము మర్మము జీవా" యిదంతా ప్రాకృతమైనదే. ఇదంతా ప్రవృత్తి సంబంధమైనదే. ఇది ఆధారము ఒకటి ఉన్నాది. అదియే నివృత్తి. ఈ కనిపించే వృక్షమునకు కనిపించని వేర్లే ఆధారము. కనిపించే భవనమునకు కనిపించని పునాదియే ఆధారము. కానీ ఈనాడు భవనాన్ని చూచి మురిసి పోతున్నాము. పునాదులు ఏమాత్రము భద్రము లేవు. ఏ క్షణమో, ఏ నిముషమో కూలిపోతుంది. ఈ దేహమనే భవనము చూసి నీవు మురిసిపోతున్నావు. Body is the temple of God. యిది

**మలినపు కొంప రోగముల ముగ్గెడు సేవకగంపజాతసం**
**చలనము పొందు దుంప భవసాగరమీదగ లేని కంప అం**
**బుల పొదిలెమ్ము చూడ మన మొప్పుదలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

ఈ దేహము ఎంతవరకు Body is the water bubble, mind is the mad monkey. Don't follow the body, don't follow the mind, follow the conscience. అదియే ఆత్మతత్త్వము. దాన్ని మనం follow చేయకుండా దేహాన్ని, మనస్సును అనుసరిస్తున్నాము. ఇది కొంతవరకు ఆధారమే. ప్రాకృతమైన జీవితము గడపేంతవరకు దేహము, మనస్సు ఉండవలసిందే. కనుక ఆనాడు బలిచక్రవర్తి అన్నివిధములైన సత్కర్మలతో ఉండినప్పటికిని,

sri sathyasai vahini amrutam

ఒక్క గర్వమును ఉంచుకోవటంచేత అన్ని విధాల బాధలకు గుర్రైపోయాడు. నాది అనే మమకారము, నేను అనే అహంకారము. దీనినే మహా భారతయుద్ధమందు అర్జునుడు యుద్ధభూమియందు ప్రవేశించాడు. ప్రారంభదినమే స్వ... అనే పదము ఉచ్ఛరిస్తూ వచ్చాడు. స్వా అనగా ఏమిటి? స్వార్థము, స్వజనులు. నావారు, నాది అనే దానితో ప్రవేశించాడు. దీనినే మోహము అన్నారు. మొట్టమొదటిది మోహ అధ్యాయము. ఈ మోహములో మునిగిన వారికి ఏమాత్రము మోక్షము లభించదు. మోహము ఉండవలసిందే కానీ ఎంతవరకు? ఈ లోకములో జీవించేంతవరకు ఉంటుండాలి. మానవుడు తన మానవత్వాన్ని చక్కగా అర్థము చేసుకోవాలి. మనము చదివిన చదువులుగానీ చేసే ఉద్యోగములు గానీ మనకు ఏనాటికి తోడురావు. ఇవన్నీ మధ్యలో జారిపోయేవే. ఇవన్నీ passing clouds. ఏ cloud ఎప్పుడు పోతుందో తెలియదు. ఇలాంటి passing clouds పైన మనం ప్రమాణం తీసుకొని మనం ఏవిధంగా జీవితాన్ని సాధించాలి. ఏ ఒక్కటి శాశ్వతమైనది కాదు. **"అనిత్యం అసుఖం లోకం ఇమం ప్రాప్య భజస్వమే"** అనింది గీత. ఏదీ శాశ్వతము కాదు. కనుక మనం శాశ్వతమైన దానిని హృదయమందు నింపుకొని అశాశ్వతమైన జగత్తును మనం సాధిస్తూ రావాలి.

**అహంకారము మహా చెడ్డది**

బలిచక్రవర్తి ఒకానొక సమయంలో ఒక యజ్ఞం ప్రారంభం చేశాడు. ఆ యజ్ఞముపేరు సర్వజిత్. అనగా సర్వాన్ని సాధించాలని యజ్ఞం ప్రారంభించాడు. ఈ సమయం పురస్కరించుకొని వామనుడు ప్రయాణమయ్యాడు. ఆ యజ్ఞానికి పోయాడు. బలిచక్రవర్తి గౌరవించి అతనికి స్వాగతము చేశాడు. యింతవరకు పోయిన వామనమూర్తి దేనిని కోరలేదు. ఈ అహంకారమును ఏవిధంగా అణగ ద్రొక్కాలో దానికి మాత్రం ప్లాను వేస్తూ పోయాడు. లోకములో ఉండిన మానవులు ప్లానులు వేస్తుంటారు. కానీ భగవంతుడు అట్టి ప్లాను వేయడు. Master plan వేస్తాడు. ముందు ముందు ఏమేమి జరగాలి ఏమేమి జరిపించాలి అనే master ప్లాను వేస్తాడు. బలిచక్రవర్తి దగ్గరకుపోయి మూడు అడుగులు దానం అడిగాడు. కానీ లోకరీతిలో చూచినప్పుడు మూడడుగులే కదా చాలా సులభమైనదిగా భావించారు. తన గురువైన శుక్రాచార్యులు వచ్చారు. 'ప్రభూ ఈ దానమునకు నీవు



srisathyasai vahini amrutham

అంగీకరించకూడదు' అన్నాడు. ఈయన సామాన్య మానవుడు కాదు. సాక్షాత్ భగవంతుడే. అప్పుడు తాను అహంకారము నిర్మూలించుకుంటూ సహజమైన మార్గములో మార్చుకుంటూపోయాడు. 'గురూజీ! సాక్షాత్ భగవంతుడే కావచ్చు. భగవంతుడే వచ్చి అడుగుతున్నాడు. అడిగే చేయి క్రిందది. ఇచ్చేవాని చేయి పైది. కనుక భగవంతుని చేయి క్రింద ఉంటున్నాది. నా చేయి పైన ఉంటున్నాది. అదే నాకు చాలు' అన్నాడు. అప్పుడు కూడను అహంకారము. మొన్న కూడా చెప్పాను. సోహం. సో....హం. ఏది మనకు లోపల పోతున్నాది. ఏది బయటకు వస్తున్నాది. సో... లోపలకు పోతున్నాది. హం... బయటకు వస్తున్నాది. సో అనగా మనం లోపలకు భగవంతుని పంపించాలి. హం అనగా అహంకారాన్ని బయటకు పంపించాలి. హం అదే అహంకారము. ఇదే సరైన హంసగాయత్రీ మంత్రమన్నారు. లోపలకు పంపవలసింది భగవంతుని సో... తీసుకోవాలి. హం వదలాలి. అహంకారాన్ని వదలాలి. సో భగవంతుని స్వీకరించాలి. ఇది ఎన్ని పర్యాయములు 21,600. Welcome and sendoff ఈ విధముగా చేస్తూ వచ్చినప్పుడే ఆ దివ్యత్వము మనకు చక్కగా అర్థమవుతుంది. కనుక ఆ అహంకారముండినంతవరకు ఎవరికి ఏవిధమైన సుఖము లభించదు. ఈ బలిచక్రవర్తి భక్తుడే, భక్తుడైనప్పటికి అహంకారము ఉండకూడదు. భక్తునకు అహంకారము మహాచెడ్డది. అది చాలా విరోధమైనది. ప్రేమచేత, వినయంచేత, శాంతిచేత, ధైర్యం చేత తాను సాధించాలి. దీనికి ఆరుగుణములు ఉంటుండాలి. ఆనందం, నిత్యం, సత్యం, ప్రేమ, అహింస, ధర్మం. ఈ ఆరు మనలో ఉండాలి. ఇవియే గురువునకు ఉండవలసిన లక్షణములు. ఈ ఆరు గుణములు ఉండినప్పుడే తాను గురువుగా ఉంటాడు. కానీ శుక్రాచార్యునకు యీ ఆరు గుణములు లేవు. అతను కూడా యీ అహంకారమునకు లోనై భగవంతుడు యీ విధముగా వచ్చాడని గుర్తించాడు. భగవంతుడు బలిచక్రవర్తి అహంకారం నిర్మూలము గావించి, ప్రేమతత్త్వాన్ని లోకానికంతా పంచుతూ వచ్చాడు. ప్రతి సంవత్సరము తాను వచ్చి ప్రజలను చూచుకొని పోవాలనే ఆశించటం చేత బలికి ఆవిధమైన వరాన్ని ప్రసాదించాడు. ప్రతి సంవత్సరము ప్రజలనుచూచే నిమిత్తమే వస్తున్నాడు కనుక యిదే 'ఓనం' అన్నారు. ఇలాంటి పవిత్రమైన గుణముచేత ప్రజలను దర్శించి ప్రజలను ఆదరించటంకోసం

srisathyasaivachanamrutam

వస్తున్నాడు. ఏ చక్రవర్తి అయినా, ఏ పామరుడైనా ప్రేమతత్వము చేత దైవత్వమును సాధించవచ్చు.

## సాక్షీభూతుడు భగవంతుడు

ఇన్ని దినముల నుంచి మీరు వస్తున్నారు, పోతున్నారు. ఈ హాలులో దీపాలంతా వెలుగుతున్నాయి. కొంతమంది వింటున్నారు. కొంతమంది అటు యిటు తిరుగుతున్నారు. కొంతమంది తూగుతున్నారు. ఎవరు ఏవిధమైన పనులు చేసినప్పటికిని జ్యోతికి ఏమాత్రము సంబంధము లేదు. ఇది సాక్షీ భూతము. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఈ సూర్య ప్రకాశములో ఎందరో ఎన్ని పనులో చేసుకుంటున్నారు. ఎన్ని పనులు చేసినా సూర్యప్రకాశమునకు ఏమాత్రము అడ్డు తగలదు. మీరు చేసే చెడ్డ పనులవల్ల భగవంతునికే మాత్రము హాని కాదు. మీరు చేసే మంచి పనులవల్ల భగవంతునికి ఏమి ఆనందము రాదు. ఈ రెండు చేసిన వానికి సంబంధించినవి. భగవంతుడు జ్యోతిర్మయుడు. జ్యోతిర్మయుడైన భగవంతునికి ఏమాత్రము మంచిచెడ్డల సంబంధము లేదు. ఈ కర్తృత్వ భోక్తృత్వములు వ్యక్తులకు మాత్రమే సంబంధించినవి. కనుక దైవత్వము ఎప్పుడు సాక్షీభూతుడే. అన్నింటికిని సాక్షిగా ఉంటుంటాడు. అదియే conscience. ఈ conscience ను మనం దగ్గరగా పెట్టుకోవాలి. అందువలనే follow the master, face the devil, fight to the end, finish the game అన్నాను. Follow the master. Who is your master? నీ conscience నీ master. దానిని నీవు follow చేసి face the devil, fight to the end. ఏమాత్రము మధ్యలో నీవు మానకూడదు. ఎంతవరకు finish the game. నీ జీవితమనే ఆట అంత్యమయ్యేంతవరకు పోరాడాలి. కానీ నేడు మాత్రమే ఉండి రేపు తప్పిపోవటం కాదు. జీవితము long life. మనము సరైన దీనిలో సాధిస్తూ రావాలి. ప్రేమను మన హృదయంలో నింపుకున్నప్పుడు సర్వము మనం సులభంగా సాధించవచ్చు. మన పిల్లలకు ప్రేమతత్వాన్ని బోధించాలి. ఎవరిపై ద్వేషాన్ని మనం పెంచుకో కూడదు. ద్వేషిని కూడా నీవు ప్రేమిస్తూ రా. అప్పుడు వాని హృదయం కూడా మారిపోతుంది. ఈ హృదయం. హృత్ + దయ =

sri sathyasai vachanamrutam

హృదయ. హృదయము దయతో కూడినది. కనుక మానవునికి compassion ఉండాలి. Mankind అన్నారు. Compassion తో నిండి ఉండాలి. ఈనాడు compassion లేదు. Fashion తో నిండి ఉన్నారు. ఈ fashion లో ఉండేంతవరకు compassion కి చోటు ఎక్కడుంది. మన హృదయము ఒక్కటే ఒక chair. Single chair not double sofa not musical chair. మన హృదయాన్ని musical chair గా మారుస్తున్నాం. ఒకటి రావటం ఒకటి పోవటం. ఎప్పటికవుతుంది? యిది నిజమైన గేమ్ కాదు. Life is a game play it అన్నారు. ఏ గేమ్ యిది. Single sofa. దీనిలో హృదయం ఎప్పుడూ శాశ్వతంగా ఉంటుండాలి. ఆ హృదయాన్ని మాత్రం వదలకుండా ఉండాలి. ఎన్ని కష్టములు ఎన్ని నష్టములు, ఎన్ని దుఃఖములు వచ్చినప్పటికిని హృదయాన్ని మార్చుకోకుండా చూచుకోవాలి. కష్టనష్టములు, సుఖదుఃఖములు, పాపపుణ్యములు వచ్చిపోయే passing clouds. వచ్చిపోయేవే. దీని పేరే జగత్. జ-గత్. రావటం, పోవటమే. ఏదీ permanent అయినది యీ జగత్తులో కనిపించనే కనిపించదు. Permanent only God. మిగతావన్నీ మధ్యలో మారిపోయేవే. యీ మార్పు చెందేవాటిని విశ్వసించి, మార్పు చెందనిదాన్ని మనం విస్మరించి మన జీవితములో అనేక కష్టములకు గురౌతున్నాము.

**నీవే దైవము**

ప్రేమస్వరూపులారా! భగవత్ప్రేమను పెంచుకోండి. ఎందుకోసమనగా మీరే భగవత్స్వరూపులు. భగవంతుడు మీకంటే వేరుగా లేడు. మీయందే ఉంటున్నాడు. మీయందే ఉంటున్నా దూరము చేసుకుంటున్నారు మీరు. అగ్ని ఉంటున్నాది. అగ్నిని ఉపయోగం చేసుకోలేకపోవటంచేత అగ్ని నుంచే నివురు ఆవరించింది. ఈ ash వచ్చి, అగ్నినే కప్పివేసింది. అగ్ని ఎక్కడ ఉంది? దాని క్రిందనే ఉంది. ఈ బూడిదని మనం ఊదివేస్తే అగ్ని మనకు కనిపిస్తుంది. మనయందే దైవత్వమనే అగ్ని ఉంటున్నాది. ఈ worldly desire అనే నివురు కప్పుకొని ఉంటున్నాది. ఈ కోరికలనే నివురును మనం ఊది వేసినప్పుడు మనకు కనిపిస్తుంది దైవత్వం. సాక్షాత్కార మనగా ఎక్కడికో పోయి తెచ్చుకోనక్కరలేదు. సాధనలు చేయనక్కరలేదు. చేయవలసింది అజ్ఞానమును దూరం చేసుకోవాలి. అవిద్యను దూరం చేసుకోవాలి. ఈ అవిద్యను దూరం చేసుకున్నప్పుడే జ్ఞానం



sri sathyasai vachanamrutam

మనలో ఆవిర్భవిస్తుంది. తల్లి అయినా దూరంగా ఉంటుంది గానీ భగవంతుడు నీకు సమీపుడు. దైవము ఉన్నంత సమీపంగా మరి ఎవరునూ లేరు. చాలా nearest and dear-est. తల్లికంటే చాలా near. అట్టి near and dear గా ఉన్న దైవత్వాన్ని మనం దూరం చేసుకుంటున్నాం. యిదే మనలోని అజ్ఞానం. ఈ అజ్ఞానం దూరం కావాలంటే ప్రేమను మనం పెంచుకోవాలి. నీవే దైవము. యిదే అన్ని మతములు బోధించాయి. క్రిష్టియన్లు కూడా దీనినే బోధించారు. జోరాష్ట్రియన్సు కూడా యిదే బోధించారు. క్రైస్తు ఏమి బోధించాడు. I am the messenger of God అన్నాడు. ఈ messenger దూరంగా ఉండేవాడు. తాను messenger. కొంతకాలమైన తర్వాత I am the son of God అన్నాడు. Son of God అంటే relationship పెరిగిపోయింది. మరికొంత కాలానికి I and my father are one అన్నాడు. అదియే భారతీయులు, ద్వైతము, విశిష్టాద్వైతము, అద్వైతము, తురీయావస్థ అన్నారు. తూరీయావస్థ ఏకత్వముతో కూడినది. ఈ ముస్లిం మతములో యిదే చెబుతూ వచ్చారు. I am in the light. నీకు స్వతంత్రము లేదు. కొంతకాలమైన తరువాత the light is in me తరువాత I am the light నీవే light. యిదే తత్వాన్ని నేనే దైవం నేనే దైవం అనే సత్యాన్ని మీరు గుర్తించుకుంటూ రావాలి. I am man. ఆకారమేగానీ నీవు man కాదు. నీవు దేహము కాదు. నీవు మనస్సు కాదు. నీవు బుద్ధి కాదు. నీవు చిత్తము కాదు. అంతఃకరణ కాదు నీవు నీవే. It is my kerchief. My kerchief is seperate from me. My flower. Flower is seperate from me. My body. Body is seperate from me. My mind. Mind is seperate from me. I am not body, I am not mind, I am not senses. Who am I? I am I. యివన్నీ కేవలం matters. నీవు మాస్టరు. కనుక master the mind be a master mind. నీవు ఆరకమైన సత్యాన్ని గుర్తించి వర్తించాలి. అప్పుడే యీ బాధలు ఏమాత్రము ఉండవు. ప్రహ్లాదుడు పడిన బాధలు ఎన్ని రకములు. ఏమాత్రము అతనికి దేహనికి సంబంధించలేదు. ఆవిధమైన కష్టాలు వచ్చినప్పటికి దైవచింతన అధికంగా చేయాలి. దైవాన్ని అమితంగా ప్రేమించాలి. ప్రేమకు హద్దే లేదు. ఈ ప్రేమకు ఒక పరిమితమే లేదు. ఈ ప్రేమను ఎవరు వర్ణించలేరు. వర్ణనకు భాషలేదు. ఈ లౌకిక వర్ణన ఒక భాషకు సంబంధించినది. యిది ప్రాకృతము. కానీ

sri sathyasaivachanamrutam

హృదయానికి సంబంధించినది ప్రేమ. కనుక love is God. Live in love. ప్రేమలేని మానవుడు స్మశానములోని శవము వంటివాడు. కనుక నీవు ప్రేమమయుడవే, ప్రేమస్వరూపుడవే. ప్రేమ అధికారివే. యిలాంటి ప్రేమను దగ్గర పెట్టుకొని ఎందుకు బాధలకు గురికావాలి. దేహాభిమానం పెంచుకోవటంచేత ప్రేమ యీవిధమైన మార్పులు చెందుతున్నాది దేహం. ఏమిటీ దేహం.

**పాంచభౌతికము దుర్బలమైన కాయము**
**ఎప్పుడో విడిచేది ఎరుక లేదు**
**శతవర్షములదాక మితము చెప్పిరి గాని**
**నమ్మరాదా మాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎరుక లేదు**

ఇలాంటి దేహాముపై మనము ఎందుకింత భ్రాంతి పెట్టుకోవాలి. అయితే ఉండినంత వరకు దేహాన్ని కాపాడుకోవాలి. ఇది ప్రయాణము చేయటానికి ఒక రథము వంటిది. దాన్ని కూడా మనం చూసుకోవలసిందే. కానీ యీనాటి మానవుడు రథాన్ని ముందు పెడుతున్నాడు. గుఱ్ఱమును వెనుక పెడుతున్నాడు. దీనివల్లనే మన ప్రయాణం ఉల్టాసీదా అయిపోయింది. Reverse. గుఱ్ఱము ముందు పెట్టాలి, బండి వెనుక పెట్టాలి. మనస్సుకు మొట్టమొదట స్థానం యివ్వాలి. రెండవది దేహానికి యివ్వాలి. కానీ మనము యిప్పుడు ఏమాత్రము చేయటం లేదు. దేహానికి food ఇస్తున్నాము. మనస్సుకు ఏమి food యిస్తున్నావు. మనస్సు బలానికి ఏ ఆహారము నందిస్తున్నావు. గుఱ్ఱమునకు ఆహారం యివ్వటం లేదు. గుఱ్ఱం weak అయిపోతున్నాది. బండి బరువెక్కుతున్నాది. ఈ బండిని ఎట్లా లాగేది. ఏవిధంగా దేహానికి నాలుగు పర్యాయములు భోజనం పెడుతున్నామో అదే విధముగా నాలుగు పర్యాయములు మనస్సుకు కూడా పెట్టాలి. ప్రాతః సమయమందు దైవచింతన. అదియే భగవంతునికి తగిన breakfast. తెల్లవారి లేస్తూనే ధ్యానం, భగవత్ చింతన, భగవత్ప్రార్థన,

srisathyasaivachanamrutam

భగవద్భజన చేయాలి. దీనిని పురస్కరించుకొనియే గాయత్రీ మంత్రమందు సరైన బోధ ఏర్పరచారు. ఓం భూర్భువస్సువః. భూలోకము, మధ్యలోకము, పైలోకము అనుకుంటున్నాం. కాదు కాదు. ఈ మూడులోకములు మనయందే ఉంటున్నాయి. భూర్ materelisation. అదే body. భువః vibration అదే ప్రాణము. సువః అదే radiation. అదే ప్రజ్ఞానం బ్రహ్మ. యీ మూడు లోకములు మనయందే ఉంటున్నాయి. ఈ మూడు రకములైన బంధన తప్పించుకోవాలంటే భగవంతునికి ప్రేమ నివేదన చేయాలి. ప్రాతః సంధ్య, మధ్యాహ్నసంధ్య, సాయంసంధ్య అని చెప్పారు. యివన్నీ పిల్లలకు ఉపనయనం చేసేసమయంలో యిలాంటివంతా బోధిస్తూ వచ్చారు. అలాంటి బోధలు యీనాడు ఎక్కడున్నాయి. అన్నీ విస్మరిస్తున్నాము. ప్రాచీనకాలమందు దీనిని ఆచరణ యందుంచేవారు. ఈనాడు ఆచరణ పోయింది. అలంకారమై పోయింది. ఆభరణమైపోయింది. కేవలం అలంకారంగా తీసుకుంటున్నారు. ఆచరణలోనే ఆనందముంటున్నాది. ఆచరణ లేని విద్యలు ఎన్ని చదివినా యివి అంత్యమయ్యేవే. మొట్టమొదట మనం ఆచరణలో పెట్టాలి. Practical science కావాలి. మనకు platform speeches కాదు. ఈ ప్లాట్‌ఫారం స్పీచెస్ అంతా సూపర్ ఫిసియల్ నాలెడ్జి. Bookish knowledge దీనివల్ల మనకు ఏమీ ప్రయోజనం లేదు. ఆచరణలో పెట్టు. ప్లేటులో ఉంటున్నాది పొటేటో చపాతి. పొటాటో చపాతి అని నూరుమార్లు చెప్పు నీ పొట్ట ఏమైనా నిండుతుందా. ఒక్కసారి తీసుకొని నోట్లో పెట్టుకో పొట్టనిండుతుంది. అదియే practical Science. భుజించు, ఆచరించు, ఆనందించు, ఆచరణలో పెట్టు అదే నీకు ఆనందము యిస్తుంది. ఈ ఆచరణలో లేని భక్తి ప్రయోజనం ఏమిటి?

**ఏకత్వము**

ప్రేమస్వరూపులారా! ఒకటి రెండైనా ఆచరించండి. అప్పుడే మనకు తగిన శాంతి చిక్కుతుంది. మన ఇంటిలో ముగ్గురున్నారు. ముగ్గురికి ఐకమత్యము లేదు. ఈ ఐకమత్యము లేనప్పుడు ఎంత ఉండి ఏమి ప్రయోజనం. ముగ్గురున్నారు. తల్లి తండ్రి కుమారుడు.

srisathyasaivachanamrutam

ముగ్గురిలో ఐకమత్యము, అన్యోన్యత లేకపోతే శాంతి ఎక్కడనుండి వస్తుంది. నీ యొక్క body house. నీలో ముగ్గురు ఉంటున్నారు. ఆత్మ తండ్రి. Mind తల్లి, బుద్ధి కుమారుడు. కర్మ కోడలు. మనస్సు, భావము, కర్మ యీ మూడింటి ఏకత్వము కలగాలి. ఈ మూడింటి ఏకత్వము లేకపోవటంచేత ఈ దేహములో అశాంతి ప్రారంభమవుతుంది. ఈ మూడింటి ఏకత్వానికి మనం ప్రయత్నం చేయాలి. ఏ నామమైనా ఫరవాలేదు. దైవనామాన్ని దేనినైనా చింతించు. దైవనామమే అక్కరలేదు. నేనే God నేనే God అనుకో. I am God అనుకో. క్రమక్రమేణా you become God. దేనిని చింతిస్తావో దాని స్వరూపాన్ని పొందుతావు. దీనినే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నారు.

**త్యాగము**

ప్రేమస్వరూపులారా! అందరికి భక్తి ఉంది. అందరికి శ్రద్ధ ఉంటున్నాది. కానీ త్యాగము లేకపోతున్నాది. యిదే బలి అనేదానికి అర్థము. బలి అనగా sacrifice. త్యాగము. త్యాగము ఉంటే ఎంతైనా సాధించవచ్చు. బలి త్యాగానికి మూలకారణము. ఈ హృదయము భక్తికి మూలకారణము. బలి రెండింటి ఏకత్వముచేత దైవత్వము పొందగలిగినాడు. బలిచక్రవర్తి, శిబిచక్రవర్తి యిలాంటి మహనీయులు పుట్టిన దేశము యీ భారతదేశము. శిబి కూడా ఒక పావురాన్ని ఒక డేగ తరుముకొని వచ్చింది. పావురము రాజుని శరణుకోరింది. అప్పుడు దాన్ని చూశాడు. శిబిచక్రవర్తి అభయమిచ్చాడు. నీవు భయపడవద్దు రక్షిస్తాను అన్నాడు. వచ్చింది డేగ. నేను తరుముకు వచ్చిన పక్షిని నాకు అందించమంది. శిబిచక్రవర్తి వినయముగా చెప్పాడు! ఓ డేగా! నీకు ఆకలౌతే పక్షి బరువుకు తగిన నా మాంసము యిస్తాను తీసుకోమన్నాడు. అదేరీతిగా పక్షి బరువంత కండలు కోసి డేగకు యిచ్చాడు. ఒక పక్షికోసం యింత త్యాగం చేశాడు శిబిచక్రవర్తి. యిలాంటి చక్రవర్తులు భారతదేశములో అనాది కాలమునుండి అనేకమంది ఉంటున్నారు. కనుక అనాది కాలమునుండి భారతదేశము ఆధ్యాత్మిక సంపత్తిలో అన్ని దేశములకు సుస్థిర శాంతి సంపదలనందిస్తూ వచ్చింది. అలాంటి మహనీయుల బాధలు ఒకరియందైనా మనం ఆచరణలో పెట్టి చూపించాలి. ఎన్ని సుఖములుండినా యీ దేహానికి సుఖముకాదు. మనసును చంపాలి. మనసు ఉండినంతవరకు ఏమాత్రం సుఖం లేదు. కనుక మనోనాశనమన్నారు. దీన్ని

sri sathyasaivachanamrutam

మనం ఏనాడు హతమారుస్తామో ఆనాడు మనకు శాంతి లభిస్తుంది. యిది బట్ట. యిది బట్ట కాదు. దారములయొక్క చేరిక. దారములు కాదు యిది పత్తి. పత్తి వలనే దారమైంది. దారము వలనే వస్త్రమైంది. కాబట్టి మనస్సు ఎక్కడ నుండి వచ్చింది? యిది కేవలం thoughts నుండి వచ్చింది. Thoughts desires గా మారిపోయింది. Desires మైండ్‌గా మారిపోయింది. కాబట్టి bundle of desires is mind. Less luggage more comfort make travel a pleasure. ఈ desires మనం తగ్గించుకుంటే, దారములు తీసివేస్తే మనకు ఏబాధ ఉండదు. బట్టయే లేదు. మైండ్ హతమార్చాలంటే మనం desires తగ్గించాలి. దీన్నే ప్రాచీనకాలంలో త్యాగం అన్నారు. కానీ త్యాగాన్ని చదువుతున్నామే గానీ రోగాన్ని అనుభవిస్తున్నాము. కృష్ణ అయ్యర్ చెప్పాడు. త్యాగం, త్యాగం. స్వామి కోరుతుంటాడని. కానీ త్యాగాన్ని కోరటం లేదు మనం. భోగాన్ని కోరుతున్నాం మనం. ఈ భోగాన్ని కోరటంచేత రోగములో మునిగిపోతున్నాం. ఈనాడు దేశములో ఎక్కడ చూచినా రోగాలు, రోగాలు. కారణం ఏమిటి? భోగాలే మూలకారణం. భోగాలుండినంత వరకు రోగాలు నివారణ కావు. ఈ రోగాలు నివారణ గావించుకోవాలంటే త్యాగము చేత భగవంతుని ప్రేమించాలి. కనుక start the day with love, fill the day with love, spend the day with love, end the day with love. This is the way to God. ఈ రకముగా మనం ప్రారంభించినప్పుడే దైవత్వము ప్రాప్తిస్తుంది.

**ఆచరణ ముఖ్యము**

ప్రేమస్వరూపులారా! ఆనాటి బలిచక్రవర్తి కేరళ రాజ్యమునకు ఎన్ని విధములైన సేవలో చేస్తూ వచ్చాడు. తన సర్వస్వము త్యాగము చేశాడు. కట్టకడపటికి తన దేహమునే త్యాగము చేశాడు. అందువల్లనే బలిచక్రవర్తి స్థానము ఎవ్వరికి లభించలేదు. ఆ రాజ్యములో ఉండిన భక్తి యింకొకరికి లేదు. పూర్వము communist state అన్నారు. ఏ స్టేటులో అయినా పార్టీ ఈ పొద్దు వస్తుంది రేపు పోతుంది. ఆనాడు మొదలు యీనాటి వరకు పద్మనాభస్వామి దేవాలయమునకు అందరు పోయేవారే. తెల్లవారి లేస్తూనే స్నానం చేయటం, గంధం రాసుకోటం భగవంతునికి నమస్కారం చేయటం. ఈ భక్తికి ఎట్టి మార్పులు కలుగలేదు. నిజమైన హిందువులుగా, నిజమైన క్రిష్టియన్‌గా, నిజమైన ముస్లింగా

sri sathyasai vahini

తయారుకావాలి. ముస్లిం అనుకొని ఆదర్శవంతమైన ముస్లిం కాకపోతే ప్రయోజనం లేదు. హిందు అనుకొని ఆదర్శ హిందువు కాకపోతే నీవు హిందువు కాదు. ఆదర్శ క్రిష్టియన్‌గా లేకపోతే నీవు క్రిష్టియన్ కాదు. ఆ విశ్వాసము, ఆ ideal నీ నడతలో చూపించాలి. అదియే నిజమైన భక్తి. అదియే నిజమైన యుక్తి. అదియే నిజమైన రక్తి. అదియే నిజమైన ముక్తి. యిలాంటి ముక్తి పొందాలంటే ఆచరణలో పెట్టాలి. నీవు అన్నీ ప్రాక్టీసులో పెట్టకపోయినా యితరులు నీకు చేసిన అపకారము మర్చిపో. యితరులకు నీవు చేసిన ఉపకారము మరచిపో. అప్పుడే నీ హృదయం ప్రశాంతంగా ఉంటుంది. ఎవరో మనలను బాధ పెట్టినారని వారిపై కక్ష తీర్చుకోటానికి ప్రయత్నించకూడదు. నీ హృదయాన్ని ఎవరో గాయపర్చారు. నీ గాయన్ని మాన్పుకోవాలంటే ఏమి చేయాలి? డాక్టరు దగ్గరకి పోయి బేండేజి కట్టి మందులు వేయటం కాదు. ఎవరు నీకు అపకారము చేశారో వారిని నీవు క్షమించు. అప్పుడు నీ గాయము మానిపోతుంది. అదే అసలైన మందు. అది ఒక్క నిముషంలో ఆరిపోతుంది. అందరిపైన క్షమ.

**క్షమ సత్యము, క్షమ ధర్మము**
**క్షమ వేదము, క్షమ అహింస**
**క్షమ సంతోషము క్షమ సర్వము**
**క్షమ సర్వస్వము సర్వ లోకములందు**

ఆ క్షమాగుణము మనం పెంచుకోవాలి. ఆ క్షమాగుణము మనకు భగవత్ప్రేమ చేతనే వస్తుంది. ప్రేమను పెంచుకోండి.

**(తేదీ 04-09-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam